ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

లీజు సొమ్ము చెల్లించాలని
ఓఎన్జీసీ వాహనం అడ్డగింపు
ఇరగవరంలో రైతుల ఆందోళన - లోపలి పేజీలో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 4 జూన్ 2025

## వెన్నుపోటు పేటెంట్ జగన్‌దే : మంతెన



భీమవరం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు పేటెంట్ జగన్‌దేనని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. భీమవరంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ తన తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచారని, కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని లక్షల కోట్లు సంపాదించి ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వైసీపీని స్థాపించారు. బాబాయిని గొడ్డలిపోటుతో హత్య చేసిన వారిని కాపాడుతూ బాబాయ్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచారు. మెగా డీఎస్సీపై మాట తప్పి నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు.

భీమడోలు: కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరలించడానికి జగన్ ముఠా ధర్నాల డ్రామా ఆడుతుందని ఆప్కాబ్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు విమర్శించారు.

## వెన్నుపోటు దినం విడ్డూరం : బడేటి



ఏలూరు టూటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినం నిర్వహించడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సొంత చెల్లి, కన్నతల్లికి జగన్ వెన్నుపోటు పొడిచారన్నారు. వెన్నుపోటు, గొడ్డలి పోటును ఆయన పేటెంట్ తీసుకున్నారని బడేటి చంటి ఎద్దేవా చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వ నాశనం అయిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. దొంగే దొంగ అన్నట్లు వెన్నుపోటుదారు అయిన జగన్‌రెడ్డి ధర్నాలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలు నెరవేర్చిందన్నారు. 16వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.

## ప్రజలు ఛీ కొట్టినా బుద్ధి రాలేదు : చింతమనేని



ఏలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ రెడ్డిని ప్రజలు ఛీ కొట్టినా బుద్ధి రాలేదని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక జడ్పీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలకు ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. సామాన్య ప్రజలతో పాటు సొంత కుటుంబ సభ్యులకు సైతం వెన్నుపోట్లు పొడిచిన జగన్‌కు కూటమి ప్రభుత్వంపై విమర్శించే అర్హత లేదన్నారు. రౌడీ షీటర్లకు మద్దతు ఇచ్చి వాళ్లను పరామర్శించే స్థాయికి జగన్ దిగజారిపోయి రాజకీయాలు చేస్తున్నాడని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని చింతమనేని విమర్శించారు. తప్పుడు కేసులతో తనను, చంద్రబాబును జైల్లో పెట్టించిన ఘనుడు అన్నారు.

## ఆకివీడులో దారుణం

చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం
పోలీసుల అదుపులో నిందితుడు
లాకప్‌లో నిందితుడిపై బాలిక మేనమామ దాడి

లోపలి పేజీలో



ఉపాధి పనుల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

## మా పాఠశాలకు రండి

లింగపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పాలంటూ మండలంలోని కలరాయనిగూడెం పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు ప్రచారం చేస్తున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి చదివే పిల్లలను తమ పాఠశాలలో చేర్పాలంటూ చుట్టు పక్కల గ్రామాలలో ప్రతిరోజూ ప్రచారం నిర్వహిస్తు న్నారు.పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక సౌకర్యాలపై కరపత్రాలు ముద్రించి ప్రతి ఇంటికి, వ్యవసాయ పనుల దగ్గరకు వెళ్లి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో ప్రైవేట్ పాఠశాలలకంటే మెరుగైన విద్య అందిస్తున్నామని, యూనిఫాం, పుస్తకాలు, షూ, బ్యాగ్, భోజనం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలలో వాట్సాప్ గ్రూప్‌లు, సోషల్‌మీడియా ద్వారా కూడా ప్రచారం చేస్తున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

## వృద్ధుల ఇంటి వద్దకే రేషన్

ఏలూరు టూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకే రేషన్ అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి రేషన్ డీలర్లను ఆదేశించారు. నగరంలో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీపై ఆరా తీశారు.

బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను, చట్టపరమైన అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. అన్నారు. జిల్లాకలెక్టరేట్‌లో కార్మికశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

### ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

ఏలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఉద్యానవన సంబంధిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కలిగించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. పీఎం విశ్వకర్మ పథకం ప్రగతిపై ఆరా తీశారు. జిల్లాలో దరఖాస్తు చేసిన 32 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో 51 మంది పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదం తెలిపింది.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న జిల్లా వ్యాప్తంగా 4.5లక్షల మొక్కలు నాటనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి మొక్కలు నాటే కార్యక్రమంపై మంగళవారం ఆమె సమీక్షించారు. జిల్లాలో ఇళ్ల ప్రగతికి నిర్ధేశించిన లక్ష్యాలను సాధించే దిశగా హౌసింగ్ అధికారులు కృషిచేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్ నుంచి ఇళ్ల ప్రగతిపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.



## బదిలీల వేళ పదోన్నతులా?



సాధారణ బదిలీల ప్రక్రియ జరుగుతుండగా జిల్లా వైద్యఆరోగ్యశాఖలో హఠాత్తుగా పదోన్నతుల కౌన్సెలింగ్‌కు తెరతీయడం పలు సందేహాలకు, వివాదానికి దారితీస్తోంది. గ్రామ/వార్డు సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్)గా పదోన్నతులు కల్పించడానికి బుధవారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. బదిలీల ప్రక్రియను నీరుగార్చేలా ఆయా బదిలీ స్థానాలను ఆశించే సీనియర్ రెగ్యులర్ ఏఎన్ఎంలకు నష్టం కలిగేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖవర్గాలు వ్యవహరిస్తున్నాయని వైద్య ఉద్యోగులు మండి పడుతున్నారు.

- వైద్య ఆరోగ్య శాఖలో కలకలం
- అడ్డుకునేందుకు ఉద్యోగుల యత్నం
- ఏళ్ల తరబడి మారుమూల ప్రాంతాలకే పరిమితమైనవారికి అన్యాయం
- ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధం
- అధికారుల అనుమతి ఉంది : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల బదిలీల వేళ ముందుగానే పదోన్నతులను ఇవ్వడంవల్ల ఏళ్లతరబడి పనిచేస్తున్నవారంతా మారుమూల ప్రాంతాలకే పరిమితమవుతారని, దీనివల్ల తమకు అన్యాయమే జరుగుతుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పదోన్నతి కౌన్సెలింగ్ ఏర్పాట్లు చేయడంతో అడ్డుకునేందుకు పలువురు ఉద్యోగులు ప్రయత్నాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో అన్ని కేడర్ల ఉద్యోగులకు బదిలీలను రెండు వారాల్లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. బదిలీలకు ముందే పదోన్నతులు ఇవ్వాలని ఎక్కడా నిర్దేశించలేదని వైద్య ఉద్యోగులు చెబుతున్నారు. ముందుగానే పదోన్నతులిస్తే అందుబాటులోవున్న మంచిస్థానాలను తాము కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర అధికారులను అభ్యర్థించినా అరణ్యరోదనే అవుతోందని వాపోతున్నారు. పంచాయితీరాజ్‌శాఖలో నియమితులై ఇపుడు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పదోన్నతితో వైద్య ఆరోగ్య శాఖలోకి రెగ్యులర్ ఉద్యోగులుగా ప్రవేశిస్తున్న ఏఎన్ఎంలపై తమకు అగౌరవం లేదని, దశాబ్దాల తరబడి రెగ్యులర్ ఏఎన్ఎంలుగా మారుమూల ప్రాంతాల్లో రీడిప్లాయ్‌మెంట్ (వర్క్ అడ్జస్ట్‌మెంట్) కింద పని చేస్తున్నవారికి తొలుత బదిలీలు కల్పించాలని అడుగుతున్నామని చెబుతున్నారు. ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం నిర్వహించ తలపెట్టిన పదోన్నతి కౌన్సెలింగ్‌ను అడ్డుకునేందుకు కొందరు వైద్యఉద్యోగులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. మరోవైపు కౌన్సెలింగ్ సాఫీగా జరిగేందుకువీలుగా పోలీసు భద్రతను కోరినట్టు ప్రచారం జరుగుతోంది.

### 256 మందికి పదోన్నతి : డీఎంహెచ్‌వో

పదోన్నతుల కౌన్సెలింగ్‌కు నిర్వహణకు రాష్ట్ర అధికారులు అనుమతించారని జిల్లా వైద్యాధికారి మాలిని వివరణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 256 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఉద్యోగులుగా పదోన్నతి కల్పిస్తున్నాం. పదోన్నతులతో వారంతా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి వస్తారు. ఇది పూర్తయిన తర్వాత కేడర్ల వారీగా బదిలీలు చేపడతాం. జిల్లాలో వైద్య ఉద్యోగుల బదిలీలు భారీగానే ఉంటాయి.

## చేతి వృత్తులకు ఊతం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

చేతి వృత్తుల వారికి శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేయడం ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి ప్రధానమంత్రి విశ్వకర్మ ఉపయుక్తం కానుంది. యూనిట్లను నెలకొల్పాడానికి ముందుకు వస్తే అందుకు తగ్గ వనరులను పరిశ్రమల శాఖ సిద్ధం చేస్తోంది. కమ్మరి, వండ్రంగి, కుమ్మరి, కలంకారి, ఇతర చేతివృత్తిదారులందరిని ఇందులో ఒకే తాటిపైకి తీసుకువస్తారు. వారి నైపుణ్యాలను పెంపొందించడానికి తగిన శిక్షణ ఇస్తారు. సామర్థ్యం, ఉత్పాదకత, ఉత్పత్తుల నాణ్యత పెంచే పరికరాలను ఇస్తారు.

### అర్హతలు.. ప్రయోజనాలు..

- కుటుంబ సంప్రదాయ వ్యాపారాల్లో నిమగ్నమై చేతులు, పనిముట్లతో పనిచేసే చేతివృత్తిదారులు, హస్తకళాకారులు నమోదు చేసుకోవచ్చు.
- రిజిస్ట్రేషన్ తేదీకి లబ్ధిదారు కనీస వయస్సు 18 ఏళ్లు. కుటుంబంలో ఒక్కరికే స్వయం ఉపాధి కల్పిస్తారు.
- గతంలో వ్యాపారాభివృద్ధి కోసం రుణాలు పొంది ఉండకూడదు.
- రుణాన్ని తిరిగి చెల్లించిన ముద్ర, పీఎం స్వానిధి లబ్ధిదారులు పీఎం విశ్వకర్మకు అర్హులు.
- లబ్ధిదారుకు విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డు ఇస్తారు.
- టూల్‌కిట్ ప్రోత్సాహకం రూ.15వేలు
- డిజిటల్ లావాదేవీకి ప్రోత్సాహకం నెలకు రూ.1 నుంచి రూ.100 అందుతుంది.



- పీఎం విశ్వకర్మ పథకంలో రుణాలు
- నైపుణ్యాభివృద్ధి శిక్షణ, భృతి

- నైపుణ్యం పెంచడం, ప్రాథమిక నైపుణ్య శిక్షణకు రోజుకు రూ.500 ఖర్చు చేస్తారు.
- ప్రాథమిక నైపుణ్య శిక్షణ పూర్తయిన వెంటనే క్రెడిట్ మద్దతు ఇస్తారు.
- 18 నెలలు రీపేమెంట్ వ్యవధితో రూ.1లక్ష రుణం.
- 30 నెలలు రీపేమెంట్ వ్యవధిలో 2 లక్షలను రెండో విడతలో ఇస్తారు.
- రుణంపై లబ్ధిదారు 5శాతం వడ్డీ కట్టాలి.

### నమోదు ఇలా..

- గ్రామ సచివాలయాలల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా నమోదు చేయించుకోవచ్చు.
- ఈ పథకం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ వెబ్‌పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ వెబ్‌సైట్ ఫెసిలిటేటర్‌గా పనిచేస్తుంది.
- బయోమెట్రిక్ ప్రామాణీకరణ ద్వారా సాధారణ సేవా కేంద్రాల ద్వారా నమోదు చేయబడుతుంది.
- లబ్ధిదారుని వివరాలను గ్రామ పంచాయతీ అధిపతి, పట్టణ, స్థానిక సంస్థల కమిషనర్లు ధ్రువీకరిస్తారు.
- జిల్లా అమలు కమిటీ లబ్ధిదారుల జాబితా పరిశీలించి సిఫారసు చేస్తుంది.

### దరఖాస్తు చేయండి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో జిల్లాలో ఇప్పటి వరకు 76,696 దరఖాస్తులను స్వీకరించినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. వివిధ దశల పరిశీలనలో తొలి విడతగా 2,855 మందికి రుణం కోసం బ్యాంకులకు జాబితాలను పంపించినట్లు ఆయన తెలిపారు. 649 మందికి రూ.5 కోట్ల రుణం మంజూరైంది. 278 మందికి టూల్ కిట్లు అందజేశామని, ఇది చిన్న, చేతి వృత్తిదారులకు బాగా ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. లబ్ధిదారులకు మొదటి ప్రాథమిక నైపుణ్య శిక్షణ అనంతరం అధునాతన శిక్షణ అందిస్తారు. వారం రోజుల్లోపు శిక్షణకు స్టైపండ్ అందిస్తారని, వృత్తి ఆధారంగా రూ.15వేల విలువైన టూల్‌కిట్ కూడా ఇస్తామన్నారు.

## కొల్లేరు సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

రాజ్యసభ సభ్యుడు
పాకా వెంకట సత్యనారాయణ
ప్రమాణస్వీకారం అనంతరం
నియోజకవర్గానికి రాక
నేతల స్వాగతం, సత్కారం



## నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

తణుకులో ఐదుగురి అరెస్ట్

లోపలి పేజీలో

## పచ్చని పాఠశాల



ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు

### ముచ్చటగొలిపే కిచెన్ గార్డెన్

ముదినేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాల ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. ముచ్చటగొలిపే కిచెన్ గార్డెన్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కల పెంపకం శ్రద్ధగా నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయుడు చక్రధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకున్నారు. జామ, పైనాపిల్ పండ్లతోపాటు కూరగాయల మొ క్కలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ నిర్వహణకు విద్యార్థులు పాఠశాల సమయానికి కంటే ముందే వస్తారు. సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలకు నీళ్లు పోస్తున్నారు.



పైనాపిల్‌ను చూపుతున్న హెచ్‌ఎం

## జిల్లా కేంద్రంలో మరో కొవిడ్ కేస్

ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం ఏలూరులో కొవిడ్ వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ఒక మహిళ(55)కు మంగళవారం కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయిందని వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్‌పి వైద్యాధికారి నరేంద్రకృష్ణ తెలిపారు. జ్వరం, జలుబు, తదితర కొవిడ్ లక్షణాలతో ఆమె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికిరాగా వైద్య పరీక్షల్లో పాజిటివ్ నిర్ధారణ అయింది. ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. జిల్లాలో కొవిడ్ పాజిటివ్ బాధితుల సంఖ్య 12కి చేరింది. ఏలూరు శాంతినగర్‌కుచెందిన ఇద్దరు దంపతులు విజయవాడ ఆసుపత్రి నుంచి ఆరోగ్యంతో మంగళవారం డిశ్చార్జి అయ్యారు.

### పుణె ల్యాబ్‌కు రెండు శాంపిల్స్

జిల్లాలో కొవిడ్ బాధితులకు సోకిన వైరస్ వేరియంట్ తెలుసుకునేందుకు ఇద్దరి శ్వాబ్‌లను పుణెలోని సీసీఎంబీ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదిక రావడానికి 14రోజుల వ్యవధి పడుతుందని డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు.

## ఆశా నియామకాలు

### దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాత్కాలిక ప్రాతిపదికన 55 ఆశా కార్యకర్తలను నియమించనున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారి మాలిని తెలిపారు. పీహెచ్‌సీల వారీగా ఖాళీల వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చడంతో పాటు, సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు వివరించారు. ఈ నెల 4నుంచి 10 వరకు సచివాలయాల వారీగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. సచివాలయాలకు అందిన దరఖాస్తులను గ్రామీణ ఆరోగ్య పారిశుధ్య, పౌష్టికాహార కమిటీ (వీహెచ్‌ఎస్ఎన్‌సీ) పరిశీలించి అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా 3 దరఖాస్తులను ఎంపికచేసి డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపిస్తుందని, జిల్లా హెల్త్ సొసైటీ(డీహెచ్‌ఎస్)ద్వారా తుది ఎంపికలు జరుగుతాయని వివరించారు.

## రేపు ఎడ్ సెట్

ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బీఈడీ ప్రవేశాలకు ఈ నెల 5న ఎడ్‌సెట్-2025 ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఏలూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు హాల్‌టిక్కెట్ల పంపిణీ పూర్తయింది.

## అధికారితో..

## ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సకాలంలో సెంటర్లను తెరవకపోవడం, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం సకాలంలో అందడం లేదా..? తదితర సమస్యలపై ఈనెల 4వ తేదీ బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. గర్భిణులు, లబ్దిదారులు, ప్రజలు
**94408 14587**
నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద చర్యలు తీసుకుంటారు.



# ఆహా.. సీమ చింతకాయలు

గణపవరంలో సీమ చింతకాయలు

- కిలో రూ.100- రూ.130 వరకు విక్రయాలు
- ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి : వైద్య నిపుణులు

గణపవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా లభించే సీమచింతకాయలు ప్రస్తుతం మార్కెట్‌లో ముంచెత్తుతున్నాయి. వైశాఖమాసం నుంచి జ్యేష్ఠ మాసం వరకు విరివిగా లభించే ఈ కాయలు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అమితంగా ఇష్టపడుతుంటారు. వేసవిలో పాఠశాలల సెలవులు సందర్భంగా పల్లెల్లో పొలాలు, పుంతలు, కాల్వగట్లపై ఉన్న చెట్ల నుంచి సీమచింతకాయలను సేకరించడంలో చిన్నారులు నిమగ్నమవుతారు. నగరాల్లోనూ, పట్టణాల్లోనూ ఈ కాయలు లభించడంతో అధికంగా కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.100 నుంచి రూ.130 వరకు వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ రెండు నెలలు కూడా పలువురికి జీవనోపాధిగా ఉంటుంది. కొంతమంది మహిళలు గంపలతో ఇంటింటికి తిరుగుతూ మరికొంత మంది యువకులు తోపుడు బండ్లపైన, మోటారు సైకిళ్లపై రహదారుల వెంబడి విక్రయాలు చేస్తున్నారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ కాయలను గర్భిణులు తినకూడదు, తింటే గర్భవిచ్ఛిత్తి జరిగే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు.

### సీమ చింతకాయలతో ప్రయోజనాలు అనేకం



సీమచింతకాయలు మధుమేహవ్యాధి నియంత్రణలో ఉంచడానికి దోహదపడతాయి. విటమిన్-సి, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికమొత్తంలో ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలోని పలు వైరస్‌లు, బ్యాక్టీరియాలతో సమర్థవంతంగా పోరాడి రోగాల బారినపడకుండా కాపాడుతుంది. గుండెకు ఎంతో మేలు చేస్తుంది. రక్తంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తుంది. కేన్సర్‌తో పోరాడే గుణాలు పుష్కలంగా ఉంటాయి.

- కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారి

# గుబాళించిన మల్లెలు



పెన్నాడపాలెం మల్లెతోటలో పూలు కోస్తున్న కూలీలు

## పెన్నాడపాలెంలో ఇంటిల్లిపాదికి ఉపాధి కల్పన

**గుబాళించే మల్లెపూలను మహిళలు తలలో పెట్టుకునేందుకు అమిత ఆసక్తి చూపుతారు. వేసవి కాలం వచ్చిందంటే మల్లెపూలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ పూల నుంచి వచ్చే సువాసనను ఆస్వాదించి, ఆనందపడుతుంటారు. ఫిబ్రవరిలో మల్లెపూల ఉత్పత్తి మొదలై జూన్ వరకు మార్కెట్‌లో అధికంగా వస్తుంటాయి. పాలకోడేరు మండలం పెన్నాడపాలెంలో పూర్వీకుల నుంచి మల్లెపూల తోటలను పెంచి ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి అందిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.**

పాలకోడేరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : వివాహ, శుభకార్యాలు, పుట్టినరోజులకు, మరే మంచి కార్యక్రమం జరిగినా గుబాళించే మల్లెలు ఉండి తీరాల్సిందే. మల్లె పూలంటే ఇష్టపడని వారుండరు. మల్లెపువ్వు కనిపించిందంటే తెంపుకుని మహిళలు తలలో పెట్టుకుని తీరాల్సిందే. ఇంటి ఆవరణలో చిన్న స్థలం ఉంటే పెరట్లో మల్లెపువ్వు మొక్క పెంచుతుంటారు. ఈ మొక్కకు ఎవరైనా దాసోహం అయి తీరాల్సిందే. సినిమాల్లో మల్లెపువ్వుకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ మల్లెపువ్వుపై చాలా సినిమాల్లో సినీ పాటలు తెరకెక్కి ఆకట్టుకున్నాయి. అటువంటి మల్లెపువ్వులు వేసవి వచ్చిందంటే ఆరు నెలలపాటు ఆ గుబాళింపు ఏ పల్లెటూరిలో చూసినా, ఏ పట్టణంలో చూసినా మహిళల తలల్లో కనిపిస్తూనే ఉంటాయి.

### పూలలో రారాజు 'మల్లెపువ్వు'

మల్లెపూలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. పూలలో రారాజుగా పిలుచుకునే ఈ మల్లెపూలను పండించేందుకు రైతులు పోటీపడతారు. ఈ కోవలోనే పాలకోడేరు మండలం పెన్నాడపాలెంలో పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయ పంటను మరచిపోకుండా మల్లెపూల తోటలను వేసి గ్రామస్థులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల వారికి మల్లెలను అందిస్తూ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. సహజంగా మల్లెపూలంటే కడియం, రాజమహేంద్రవరం అని చెబుతుంటారు. కానీ పెన్నాడపాలెంలో పండించే ఈ మల్లెపూల గుబాళింపే వేరు. వ్యాపారాలు చేసుకునేవారు పెన్నాడపాలెంలో పండే మల్లెపూలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. ఉదయమే వచ్చి పువ్వుల్ని కోయించుకుని భీమవరం, శృంగవృక్షం, వీరవాసరం గ్రామాల్లో అమ్ముకుంటూ జీవనోపాధిని సాగిస్తున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈపూలను కోస్తూ, అమ్ముతూ ఉపాధి పొందుతారు. సాయంత్రం సమయంలో వంద మొగ్గలు రూ.20 చొప్పున అమ్ముకుంటూ వేసవిని గడిపేస్తుంటారు.

### మల్లెలతో ఉపయోగాలెన్నో..!

మల్లెపూలను వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. తలలో చుండ్రు సమస్యను అరికట్టేందుకు మల్లెలు ఉపయోగపడతాయి. అలసిపోయిన కనులపై మల్లెపూలను కొద్దిసేపు ఉంచినట్లయితే కళ్లు సైతం చల్లబడతాయి. కొబ్బరి నూనెలో మల్లెపువ్వులు వేసి రాత్రంతా బాగా నానబెట్టి ఆ తర్వాత వాటిని మరగబెట్టి తలకు పట్టిస్తే కేశాలు ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా చల్లదనాన్ని ఇస్తుంది. మల్లెపువ్వులను ఫేస్‌ప్యాక్‌గా కూడా వాడుకోవచ్చు. మల్లెల్ని పేస్ట్‌గా చేసి కొద్దిగా పాలు కలిపి నెమ్మదిగా మసాజ్ చేస్తే ఎంతో బాగుంటుంది. మల్లెపువ్వుల రసం తీసి గులాబీ పువ్వుల రసంతో గుడ్డులోని పచ్చసొన రెండు స్పూన్లు చొప్పున ముఖానికి రాస్తే కాంతివంతంగా ఉంటుంది. మల్లెపూలలో విటమిన్ 'సి' పుష్కలంగా ఉండడం వల్ల దీనిని ఔషధాలలో వినియోగిస్తుంటారు.

### పువ్వులు కోయడమంటే చాలా ఇష్టం



వేసవి కాలంలో అమ్మమ్మకి తోడుగా మల్లె పువ్వులు కోస్తూ సరదాగా గడుపుతా. మల్లెపువ్వుల తోట అంటే చాలా ఇష్టం. చిన్నప్పటి నుంచి అమ్మమ్మ,తాతయ్య పండించే తోటలోకి వచ్చి పూలు కోస్తూ ఉంటా. సాయంత్రం సమయంలో ఇంటి వద్దకు వచ్చే వారికి పూలు అమ్ముతా.

-ఆరేపల్లి అవినాశ్, 8వ తరగతి విద్యార్థి

### మల్లెపూలకు మంచి డిమాండ్



పెన్నాడపాలెం తోటల్లో పండించే మల్లెపూలకు చాలా డిమాండ్ ఉంటుంది. చాలా దూరాల నుంచి వచ్చి మేము పండించే మల్లెపూలను కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు. పెన్నాడపాలెంలో సాయంత్రమైందంటే మల్లెల గుబాళింపుతో తోటలు కళకళలాడతాయి. తోటలను చూస్తేనే తెలియని ఆనందం కలుగుతుంది.

- వీరగని వెంకట వినయ్, పెన్నాడపాలెం

### ప్రభుత్వం సహకరించాలి



పెన్నాడపాలెంలో ఒకప్పుడు ఏ మూలన చూసినా మల్లెపూల తోటలు కనిపించేవి. ప్రస్తుతం చాలా తోటలు తగ్గిపోయాయి. కష్టం తప్ప ఆదాయం రావడం లేదు. గ్రామంలోని మల్లెల గుబాళింపే వేరు. అటువంటి మల్లెపంటను పండిస్తున్న రైతులను ప్రభుత్వం పట్టించుకుని ఆర్థిక సాయం అందిస్తే మరింత బాగుంటుంది. రైతుల్లో కూడా ఉత్సాహం పెరుగుతుంది.

- వెంకటేశ్వరరావు, పెన్నాడపాలెం

# తీరనున్న కల

## తాడేపల్లిగూడెంలో అందుబాటులోకి ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్

## ప్రభుత్వ విప్ బొలిశెట్టి సారథ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పరుగులు

పెంటపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో వినోదం అందుబాటులోకి రానుంది. పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభించనుంది. క్రీడాకారుల కల తీరనుంది. 2018 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో అప్పుడు మంత్రిగా ఉన్న పైడికొండల మాణిక్యాలరావు హయాంలో పట్టణంలో క్రీడాకారుల కోసం సుమారు రూ.2.50 కోట్లతో ఇండోర్ స్టేడియం, మరో 2.50 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 50 శాతంపైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. చివరిదశలో కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉండడంతో అప్పటి కాంట్రాక్టర్లు కొంత నిర్మాణం జరిగిన తరువాత పనులను ముందుకు తీసుకు వెళ్లకుండా వదిలేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. కనీసం నిర్మాణాలవైపు కన్నెత్తి కూడా చూడలేదు. సగం నిర్మాణ పనులను యథావిధిగా వదిలేసింది. ఫలితంగా ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పనులకు మోక్షం వచ్చింది. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో రెండు నిర్మాణాలకు సుమారు మరో రూ.2 కోట్లు వెచ్చించి పనులు ముందుకు తీసుకు వెళ్లనున్నారు. దీనికి ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు దాతలు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు.

### పీ4 విధానంతో పనులు

ప్రభుత్వం చేపట్టిన పీ4 విధానం ద్వారా ఈ రెండు పనులు పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం వీటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు రెండింటికి కలిపి మరో రూ.1.50 కోట్లు వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ విప్, బొలిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో దాతల సహకారంతో పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం సుమారు రూ.30 లక్షలను ఎమ్మెల్యే బొలిశెట్టి ఖర్చు చేశారు. స్విమ్మింగ్ నిర్మాణం కోసం మరో రూ.5 లక్షలు సహకారం అందజేశారు. ప్రస్తుతం రెండు పనులను నిర్మాణ దశలో ఉన్నాయి. త్వరలోనే వీటిని ప్రజా సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.





తాడేపల్లిగూడెంలో నిర్మాణం జరుగుతున్న ఇండోర్ స్టేడియం (ఇన్‌సెట్‌లో) స్విమ్మింగ్ పూల్

### టెన్నిస్, బ్యాడ్మింటన్ కోసం..

ఇండోర్ స్టేడియాన్ని టెన్నిస్, బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం నిర్మాణం అవుతుంది. ఇప్పటివరకు పట్టణంలో క్రీడా కారుల కోసం ప్రత్యేకమైన గ్రౌండ్‌లు ఏమీ లేవు. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే బొలిశెట్టి సారథ్యంలో క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ఈతగాళ్లకు ఊరట..

తాడేపల్లిగూడెంలో ఇప్పటివరకు ఎక్కడా స్విమ్మింగ్ పూల్ లేదు. ఈత కొట్టేందుకు కాలువలోకి వెళ్లి చాలామంది యువకులు, విద్యార్థులు మరెందరో అసువులు బాసిన పరిస్థితులు చాలా ఉన్నాయి. ఇంతకాలానికి ఈత కొట్టే వారి కోరిక తీరనుంది. ప్రస్తుతం నిర్మాణం చేస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల నుంచి ప్రతీ ఒక్కరికి ఈత కొట్టడంలో శిక్షణ ఇచ్చేలా నిర్మాణం జరుగుతుంది.



మద్ది ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

## మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం,జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్వాయిగూడెం గ్రామంలో వున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఆంజనేయునికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి పలు సేవల రూపంలో రూ.2,23,162 ఆదాయం సమకూరిందని ఈవో ఆర్‌వి.చందన తెలిపారు.





అలంకరణలో కుంకుళ్లమ్మ.. అంకురార్పణ జరుపుతున్న అర్చకులు, పండితులు.

## కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి ఉపాలయమైన ఆలయంలో త్రయాహ్నిక దీక్షతో ప్రారంభమైన ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో నయనానందకరంగా సుందరీకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచన, అంకురార్పణను అర్చకులు పుసులూరి భైరవ నేతృత్వంలో పండితులు జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు.



ఏలూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల ధర్నా

## డిపో సీఐ ప్రవర్తనపై ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు డిపో కార్యదర్శి డి.ఆంజనేయులు పట్ల ఏలూరు ఆర్టీసీ డిపో సీఐ దురుసు ప్రవర్తనకు నిరసనగా మంగళవారం ఏలూరు ఆర్టీసీ గ్యారేజీ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవాధ్యక్షుడు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ డిపో కార్యదర్శి ఆంజనేయులు పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. యూనియన్ నాయకులు, కమిటీ సభ్యుల పట్ల ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో సెక్రటరీ డి.ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం కొనసాగుతుందని బుధవారం నుంచి నాన్ కో-ఆపరేషన్ మొదలు పెడుతున్నామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో డిపో నాయకులు వీఎస్ నారాయణ, ఎండి రాజేష్, వీకేబీ రాజు, పి.శ్రీహరి మొదలగువారు నాయకత్వం వహించారు.

## సెకండరీ విద్య సంస్కరణలపై డీఆర్పీలకు శిక్షణ ప్రారంభం




మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు

ఏలూరు అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ విద్య బోధించే స్కూల్ అసిస్టెంట్లకు నూతన విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్న పలు అంశాలపై శిక్షణనిచ్చే కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల శిక్షణ తరగతులు స్థానిక సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో మంగళవారం ప్రారంభమయ్యాయి. లాంగ్వేజెస్, నాన్-లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో 160మంది స్కూల్ అసిస్టెంట్లు, 14మంది హెచ్‌ఎంలను బృందాలుగా విభజించి శిక్షణ అంశాలపై చర్చాగోష్ఠులు, డివిజన్లు, మండలాల్లో చేపట్టాల్సిన శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కోర్సు డైరెక్టర్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసుకున్న డీఆర్పీలందరూ జిల్లాలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 3,250మంది స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులకు ఈనెల 8, 9, 10 తేదీల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నూతన విద్యాసంవత్సరంలో అమలుచేయనున్న టీచర్ హ్యాండ్‌బుక్, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్, కరికులం ఇంటిగ్రేషన్, అకడమిక్ కేలండర్‌లను ప్రభుత్వ నిబంధనల మేరకు కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశీలకునిగా విచ్చేసిన ఎస్సీఈఆర్టీ ప్రతినిధి రాజాబాబు మాట్లాడుతూ ఆరో తరగతి బాలబాలికలకు సంసిద్ధతా కార్యక్రమం, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు, 40 రోజుల బ్రిడ్జి కోర్సులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కొత్త విద్యాసంవత్సరంలో 12 తరగతులు, 9, 10 తరగతులకు హిందీ సబ్జెక్టులో నూతన సిలబస్ పాఠ్యపుస్తకాలు రూపొందాయని వెల్లడించారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్లు, దూబచర్ల 'డైట్' కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ క్రీడా స్కూల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

ఏలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారు వైఎస్ఆర్ కడప క్రీడా పాఠశాలలో 2025-26 ఏడాదికిగాను 4, 5 తరగతి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. 4వ తరగతి అడ్మిషన్‌కు 2015 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. 5వ తరగతి అడ్మిషన్‌కు 2014 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించినవారే ఉండాలని తెలిపారు. ఈనెల 20 నుంచి 25తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్క్రీనింగ్ షార్ట్‌లిస్ట్ చేసిన అనంతరం విడుదల చేసిన జాబితా ప్రకారం జూలై ఒకటి నుంచి మూడో తేదీ వరకు అయా క్రీడాప్రాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98663 17326 నంబరులో సంప్రదించాలన్నారు.



ఏలూరు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం

## రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సేవలు విస్తృతంగా చేయాలని, ప్రస్తుతం రెడ్‌క్రాస్ వద్ద ఉన్న రెండు డయాలసిస్ మిషన్లకు అదనంగా మరో రెండు డయాలసిస్ మిషన్లతో డయాలసిస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్, కార్యవర్గ కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించిన అనంతరం కార్యవర్గానికి ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాయ్‌హాన్ కాఫీ లిమిటెడ్ వారు అందిస్తామన్న మరో రెండు మిషన్లతో రక్త యూనిట్ల నిల్వలను పెంచి రెడ్‌క్రాస్ బ్లడ్ కేంద్రంలో నాణ్యమైన, సురక్షితమైన రక్తాన్ని అవసరమైన ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీని సేవా కార్యక్రమాలలో ప్రథమ స్థానంలో ఉండేలా కమిటీ సభ్యులు అందరూ సమష్టి కృషి చేయాలని, అందుకు అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు.

### 'రెడ్‌క్రాస్'లో యోగాంధ్ర మాసోత్సవాలు

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసీమియా భవనంలో యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబీఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రెసిడెంట్ రెడ్‌క్రాస్ సొసైటీ కె.వెట్రిసెల్వి ఆదేశాలతో జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని రెడ్‌క్రాస్ భవనంలో జూన్ 21 వరకు ఉదయం ఏడు నుంచి 8 గంటల వరకు యోగా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థినులు, మానవత సభ్యులు యోగ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. అనంతరం యోగా గురువులు షైలవరపు లక్ష్మీనరసింహం, ఎం.మల్లికార్జునరావు మాట్లాడారు.

## ఎన్‌టీఆర్ క్రికెట్ విజేత 'విరాట్-11 జట్టు'

వేలేరుపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వేలేరుపాడులోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన ఎన్‌టీఆర్ క్రికెట్ ట్రోఫీలో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. ఏప్రిల్ 23 నుంచి ప్రారంభమైన క్రికెట్ టోర్నీలో 56 జట్లు పాల్గొనగా 45 రోజుల పాటు మ్యాచ్‌లు జరిగాయి. ఫైనల్‌కి విరాట్-11 జట్టు కన్నాయిగుట్ట టీమ్‌లు రాగా మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విరాట్ -11జట్టు గెలపొందింది. రన్నరప్‌గా కన్నాయిగుట్ట టీమ్ నిలిచింది. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో విరాట్-11 జట్టుకు రూ.50,116 మొదటి బహుమతిగా, రన్నరప్‌గా నిలిచి టీమ్‌కు రూ.25,116, 3వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.12,116లను ట్రోఫీలకు టీడీపీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, సబ్‌ఇన్‌స్పెక్టర్ కేవీ రామారావు దాతల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వేలేరుపాడులో నిర్వహిస్తున్న ఎన్‌టీఆర్ క్రికెట్ టోర్నీకి విశేష స్పందన లభిస్తుందని విజేతలకు నగదు బహుమతులు అందించేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు శాఖమూరి సంజీవులు, టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టం రాంబాబు, టీడీపీ నాయకులు పసుపులేటి లక్ష్మయ్య, కొమ్మన వెంకటేశ్వరరావు, కురుమెళ్ల సుధాకర్, కోటిపల్లి ముత్యాలరావు, గొంది నాగేశ్వరరావు, బీరం అంజిబాబు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విరాట్-11టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు


రిగ్ సామగ్రి వాహనాన్ని అడ్డుకున్న రైతులు

## లీజు సొమ్ము చెల్లించాలంటూ ఆందోళన

### ఓఎన్జీసీ వాహనాన్ని అడ్డుకున్న రైతులు

ఇరగవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రిగ్ నిమిత్తం ఓఎన్జీసీ లీజుకు తీసుకున్న పొలాలకు సక్రమంగా సొమ్ము చెల్లించాలంటూ మంగళవారం ఇరగవరంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఇరగవరంలో ఓఎన్జీసీ రిగ్ నిమిత్తం 2023లో 21 మంది రైతుల నుంచి లీజు ప్రాతిపదికన 7.35 ఎకరాలు సేకరించింది. ఎకరాకు రూ. 81,200 చొప్పున ఏడాదికి రెండు దఫాలుగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుని ఒక దఫా సొమ్ము మాత్రమే చెల్లించారని అది కూడా కొంత మందికే వచ్చాయన్నారు. పొలాల్లో ఉన్న కొబ్బరి చెట్టుకు రూ. 6090, తాటిచెట్టుకు రూ.350, మామిడి చెట్టుకు రూ.7,283 పరిహారం చెల్లించేందుకు అంగీకరించినా నేటికి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని ఆరోపించారు. అయితే ఈ ప్రాంతంలో రిగ్ పడక పోవడంతో వాహనాల్లో సామగ్రిని తరలించే సమయంలో రైతులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. రిగ్ నిమిత్తం ఐదేళ్ల అగ్రిమెంట్ అని చెప్పి అర్ధంతరంగా ఖాళీ చేసి వెళ్ళిపోవడంపై రైతులు అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓఎన్జీసీ డీటీ జనార్దన్ మాట్లాడుతూ రిగ్ సైట్‌లో పక్క రైతులు భూములు కలవడం వల్ల సమస్య వచ్చిందని, సైట్ ఖాళీ చేసి రైతులకు అప్పగించే వరకు లీజు సొమ్ములు జమ చేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చెట్ల సొమ్ము వారంలోగా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



## 'పాకా'కు బీజేపీ నాయకుల ఘన స్వాగతం

ఏలూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణకు కలపర్రు వద్ద బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరితో పాటు జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఇటీవల ఢిల్లీలో ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మంగళవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ఏలూరు మీదుగా భీమవరం వెళ్తున్న పాకా సత్యనారాయణను కలపర్రు వద్ద గారపాటి చౌదరి, బీజేపీ నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన పాకాకు రాజ్యసభ పదవి, ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు కేంద్రమంత్రిగా అవకాశం దక్కిందని అది బీజేపీతోనే సాధ్యమని గారపాటి చౌదరి అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, ఉంగుటూరు నియోజకవర్గం కన్వీనర్ శరణాల మాలతీరాణి, దెందులూరు నియోజకవర్గం కన్వీనర్ గుమ్మడి చైతన్య, బీసీ నాయకులు అశోక్ గౌడ్, అడపా శోభారాణి, నగరపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మానవుల ప్రధాన శత్రువులు దోమలే!


అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

పెదవేగి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మానవులకు దోమలు ప్రధాన శత్రువులని, వాటి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా పెదవేగి పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో మలేరియా ప్రబలే విధానం, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా మలేరియా అధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా ప్రజలు అధికంగా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. దోమల వ్యాప్తిని అరికడితే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వలేకుండా చేస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి, సహాయ మలేరియా అధికారి జె. గోవిందరావు, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, పీహెచ్ఎన్ మంగమ్మ, సూపర్‌వైజర్లు రమేష్, యామిని, సుజాత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

ఏలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ చైర్మన్‌గా చాగంటి మురళీకృష్ణ ఏలూరులో వేర్వేరుగా బుధవారం పదవీ ప్రమాణ స్వీకారాలు చేయనున్నారు. డీసీసీబీ కార్యాలయంలో వీరాంజనేయులు, డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయం వద్ద డీసీఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేయడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## చింతమనేనికి గన్ని ఆహ్వానం

పెదవేగి, జూన 3(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్‌గా బుధవారం ఏలూరులో జరిగే ప్రమాణ స్వీకారానికి, అలాగే 6న ఆప్కాబ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు రావాలంటూ డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌గా ఎన్నికైన గన్ని వీరాంజనేయులు దుగ్గిరాలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కలిసి సాదరంగా ఆహ్వానించారు.

## అనవసరంగా ఎరువులు వాడవద్దు

### రైతులకు శాస్త్రవేత్తల సూచన

అత్తిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు సార్వా పంటకు అనవసరంగా ఎరువులు వాడవద్దని మార్టేరు వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఆనందకుమార్ కోరారు. అత్తిలి మండలం పాలూరు కమ్యూనిటీ హాల్ భవనంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్ములో తప్ప ఇతర సమయంలో కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని సూచించారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ తోటలపై ఆయిల్‌పామ్ శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్ అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దిబోరా, మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లారి సురేష్, పాలూరు సర్పంచ్ దయామణి, ఉప సర్పంచ్ రాపేటి సింహాచలం, పాలూరు, కొమ్మర, ఈడూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలి : ఎంవీఐ



ఏలూరు క్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుంటే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించవచ్చునని ఎంవీఐ పి. రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, అలాగే కారు తదితర వాహనాలను నడిపేటప్పుడు సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యపానం చేసి వాహనాలు నడపరాదన్నారు. ఆర్సీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్సు తదితర వాహన పత్రాలను వాహనంతో పాటు ఉంచుకోవాలన్నారు.

# గుడ్డు.. బేజారు

- ధర వచ్చే వరకు అమ్మకాల నిలుపుదల... వ్యాపారుల సిండికేటుతో రైతుల నిర్ణయం
- గుడ్డు రూ.5.40 నుంచి రూ. 4.40లకే కొనుగోలు... ఇలాగైతే పౌల్ట్రీ మనుగడ కష్టమే



తణుకు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. బెంగాల్ వాస్తవంగా గుడ్లలకు భారీగా డిమాండ్ ఉంది. కాని బెంగాల్, బీహార్ ట్రేడర్లు స్థానికంగా సిండికేట్ అయ్యి రైతులకు ధర విషయంలో భారీగా కోత విధిస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక, నష్టాలు భరించలేక తమ ఉత్పత్తి చేసిన గుడ్లలు తమ వద్దే ఉంచుకునేలా రైతులు మూకుమ్మడిగా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల బర్డ్‌ఫ్లూతో పౌల్ట్రీ రంగం కుదేలైంది. వేసవిలో ఉత్పత్తి తగ్గిపోవడం సర్వసాధారణం, దీనికి తోడు ట్రేడర్ల మాయాజాలంతో మరింత కుంగిపోయేలా వ్యవహరించడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

### జిల్లాలో 90 లక్షల గుడ్లు ఉత్పత్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీలలో కోటి 30 లక్షల కోళ్లు ఉన్నాయి. వాటి నుంచి ప్రతిరోజు సుమారుగా 90లక్షల గడ్ల ఉత్పత్తి అవుతున్నాయి.చిన్న, పెద్ద రైతులు 230 మంది వరకు ఉంటారు. స్థానికంగా 30లక్షల గుడ్లు వరకు విక్రయాలు జరుగుతాయి. మిగిలిన 70 లక్షలు ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. వాటిలో ప్రధానంగా పశ్చిమ బెంగాల్, కోల్‌కతా, బీహార్, ఒడిశా, కర్నాటక వంటి రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ డిమాండ్ ఉన్నప్పటికీ కావాలనే ట్రేడర్లు రైతుకు నష్టం వచ్చేలా ధరలు నిర్ణయం చేస్తుండటం మింగుడుపడటం లేదు. కనీసం నెక్ ధర ఇచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

### సౌత్ మార్కెట్ ఓకే..

సౌత్ మార్కెట్‌లో గుడ్డు ధర బాగానే పలుకుతోంది. అక్కడ రైతుకు అనుకూలమైన ధర లభిస్తోంది. హైదరాబాదులో 5.50, తమిళనాడులో 5.60, కర్నాటకలో 6.00, కోల్‌కతాలో మాత్రం ధరను భారీగా తగ్గించి 4.40 పైసలుగా చెబుతున్నారు. ఇది మన రైతులకు మాత్రం అంతుచిక్కడం లేదు.

### అంతా ట్రేడర్స్ హవా

గుడ్డులు ఎగుమతుల విషయంలో ట్రేడర్స్ హవానే కొనసాగుతోంది. నెక్ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసిన సందర్భాలు తక్కువగా ఉంటాయి. నెక్ ధరకు తక్కువగా కొనుగోలు చేయడంతో పాటు కమీషన్ కూడా తీసుకుంటారు. కష్టపడి ఉత్పత్తి చేసిన రైతుకు మాత్రం నష్టాలు మూటకట్టుకోవాల్సిన వస్తోంది. ప్రధానంగా కోల్‌కతా ట్రేడర్స్, బెంగాల్‌కు చెందిన ట్రేడరు స్థానికంగా ఉంటూ ఇరువురు సిండికేట్ అయ్యి ధరలు తగ్గిస్తున్నారని రైతులు బలంగా నమ్ముతున్నారు. నెక్ ధర ఇచ్చే వరకు మూడ్రోజులైన సరే రైతులు వెనక్కి తగ్గి అవకాశం లేదని చెబుతున్నారు.

### వారం రోజులుగా తగ్గిస్తూ..

గుడ్ల ఎగుమతుల విషయంలో రైతులు ఇప్పటికిప్పుడు నిర్ణయం చేయలేదు. వారం రోజులుగా ట్రేడర్లు రైతులను ఏమార్చి ధరలు తగ్గిస్తూ వస్తున్నారు. వారం రోజులుగా ఈ వ్యవహారం కొనసాగుతోంది.5.40 పైసలు నుంచి వారం రోజుల నుంచి ఇప్పుడు 4.85 పైసలు నెక్ ధరగా నిర్ణయించారు. కాని ట్రేడర్లు 4.40కే రైతులను విక్రయించాలని చెబుతున్నారు. దీంతో రైతులు గిట్టుబాటు కాక ఎగుమతులు నిలుపుదల చేశారు.

**కావాలనే ధరల తగ్గింపు..**

**మల్లిన శ్రీనివాసరావు, గోదావరి నెక్ చైర్మన్**



ట్రేడర్స్ కావాలనే ధరలు తగ్గిస్తున్నారు. ట్రేడర్ల నిర్ణయం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోల్‌కతాలో ధర లేదని చెబుతూ ఇక్కడ తగ్గిస్తున్నారు. వాస్తవానికి అక్కడ ధర బాగానే ఉంది. అలాగే డిమాండ్ ఉంది. పరిస్థితులు ఇలానే ఉంటే పౌల్ట్రీ పరిశ్రమ మనుగడ కష్ట సాధ్యంగా ఉంటుంది. నెక్ ధర వచ్చే వరకు రైతులు నిర్ణయం కొనసాగుతుంది.


చేతివృత్తిదారుల సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

## చేతివృత్తిదారులను ఆదుకోవాలి

### చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చేతివృత్తిదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని చేతివృత్తిదారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం స్ఫూర్తి భవనంలో జరిగిన సమావేశానికి చేతివృత్తిదారుల సమాఖ్య ఏలూరు జిల్లా కన్వీనర్ కడుపు కన్నయ్య అధ్యక్షత వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కేవలం చేతివృత్తిదారుల ఓట్లు పొందడానికి మభ్యపెట్టే వాగ్దానాలు చేయడం, ఆ తరువాత వారి సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వలన నిస్సహాయ స్థితిలో చేతివృత్తిదారులు నేటి మార్కెట్ పోటీని తట్టుకోలేక తమ వృత్తులను వదిలిపెట్టి అర్థాకలితో జీవిస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం సాధారణ చేతివృత్తిదారులను ఏ మాత్రం ఆదుకోలేకపోయిందన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏపీ గొర్రెలు, మేకల సంఘం అధ్యక్షులు పొట్టేలు పెంటయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసడాంగే, కోశాధికారి పుప్పాల కన్నబాబు, సంఘ నాయకులు మాగంటి సూర్యనారాయణ, బళ్ళ కనకదుర్గారావు, యర్రా వెంకటేశ్వర్లు, బుగ్గల ప్రభాకర్, కనకం జగన్, పి.నాగేశ్వరరావు, ఎ.త్రిమూర్తి పాల్గొన్నారు.

## ఘనంగా కొర్రాజులు పెద్దమ్మతల్లి జాతర



జీలుగుమిల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ములగలంపల్లిలో కొర్రాజులు పెద్దమ్మతల్లి జాతరను గిరిజనులు సాంప్రదాయ బద్దంగా నిర్వహిస్తున్నారు. మూడేళ్లకోసారి నిర్వహించే ఈ జాతర గిరిజనులు వారం రోజులపాటు జరుపుతారు. ప్రధానంగా అ మ్మవారు గద్దె ఎక్కడం, నిత్యదీపారాధనలు, బియ్యం కొలవడం వనదేవతల్ని తీసుకురావడం కోర్కెలు నెరవేర్చేందుకు నిప్పులగుండం కార్యక్రమం వంటి ప్రత్యేక పూజలు వారం రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. గ్రామ పెద్దలు బేతిన దుర్గారావు, జిన్నె వెంకటేశ్వరరావు, గోపిన రాము, బేతిన ప్రభాకర్ కమిటీ సభ్యులున్నారు.


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆదివాసీలు

## 20వ రోజుకు ఆదివాసీల దీక్షలు

బుట్టాయగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం కోసం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ఏజేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య ప్రారంభించి మద్దతుగా దీక్షల్లో పాల్గొన్నారు. ఆదివాసీలు 20 రోజులుగా దీక్షలు చేస్తుంటే ప్రభుత్వానికి కానరాకపోవడం బాధకరమన్నారు. దీక్షల్లో సర్పంచ్‌లు కుంజా వెంకటేశ్వరావు, ఉయికె బుజ్జి, జేఏసీ నాయకులు కుంజా కృష్ణంరాజు, తెల్లం శ్రీను, పూనం శ్రీను, కుంజా రమేష్, తెల్లం గంగరాజు పాల్గొన్నారు.

## జగన్ వ్యాఖ్యలపై ఫైర్

ఏలూరు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని జగన్ చేసిన వ్యాఖ్యలను ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచి ఓటమిని చవిచూసిందని విమర్శించారు. ఈ నెల 4న ప్రజా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ వెన్నుపోటు దినంగా నిరసన తెలుపుతామని వైసీపీ అధిష్టానం పిలుపునివ్వడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసకర దుస్థితికి చేర్చిన ఘనత వైసీపీదే అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల దృష్టిని మళ్ళించడానికే డ్రామాలాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు.

## అవినీతిపై చర్యలు తీసుకోండి

ఏలూరుటూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో అవినీతి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. 2020 - 24 సంవత్సరాల మధ్యకాలంలో విధులు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం 498జీఓ సర్క్యులర్ జారీ చేసింది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఆ మధ్యకాలంలో వచ్చిన ఆరోపణలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఏసీబీ నివేదికలో ప్రభుత్వానికి పంపగా ప్రభుత్వం సంబంధిత అధికారులపై డిసిప్లేనరీ యాక్షన్ తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వై.శ్రీనివాస్, ఏసీపీ శాంతిలత, సూపర్‌వైజర్ ఎస్.సాంబశివరావు, టౌన్ సర్వేయర్ వెంకట్రమణ, డీటీపీఓ చాందిని, చైన్ మ్యాన్‌లు వీ.శ్రీనివాస్, రవికుమార్, అజీత్, సెక్షన్ సూపర్ వైజర్ డీవీకే.సురేశ్, వార్డుప్లేనర్స్ ఎస్.వీణాకుమారి, వెంకటలత, అప్పటి కమిషనర్ షేక్ షాహీద్, ఈడా వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌లపై చర్యలు తీసుకోవాలని సురేశ్‌కుమార్ ఆదేశాల జారీ చేశారు.

## పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు

- ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

చింతలపూడి, జూన్ 3(ఆంధ్రజ్యోతి):చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. చింతలపూడి ప్రాంతంలో కోకో 40 శాతం పండిస్తున్నారని, దీంతో చాక్లెట్ పరిశ్రమకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రాంతంలో కోకో, బటర్, మాస్ తదితర ఉత్పాదక మార్కెటింగ్ అంశాలపై ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర స్థాయి అధికారులు, ఇన్వెస్టర్లు, కోకో ఫర్మంటేషన్ ప్రతినిధుల సమావేశం జరిగిందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సముకత వ్యక్తం చేశారని అన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ఉపాధిఅవకాశాలు పెరుగుతాయని, పట్టాయిగూడెంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 69.5 ఎకరాల స్థల సేకరణ పూర్తయ్యి శంకుస్థాపన జరిగిందన్నారు. మరిన్ని పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు.

**క్రైం సమాచారం**

## కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

భీమడోలు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి బాధ భరించలేక ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమడోలు మండలం అన్నేవారిగూడెంలోజరిగింది.భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన అన్నెపు దుర్గాప్రసాద్(35) విపరీతంగా కడుపునొప్పి వచ్చిందని బాధ భరించలేక మంగళవారం పురుగుల మందు తాగి చనిపోయినట్లు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## యువతి పేరుపై ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతా

- అసభ్యకరమైన మెసేజ్‌లపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి పేరుపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్‌ను ఓపెన్ చేసి అందులో అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టిన ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు వన్‌టౌన్‌లోని ఒక యువతి తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టే ఫొటోలను మరో గుర్తు తెలియని వ్యక్తికాపీ చేసి ఆ యువతి పేరుపైనే మరో ఇన్‌స్టాగ్రామ్ నకిలీ అకౌంట్ ఓపెన్ చేసి అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టడంతో గుర్తించిన బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ బి.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాకీ చెల్లించలేదని యువకుడి కిడ్నాప్ ఆపై దాడి

ఏలూరు క్రైం : డబ్బులు ఇవ్వాలని ఒక యువకుడిని అడ్డగించి అతడి దగ్గర ఉన్న మోటారు సైకిల్‌ను తీసుకుని అతడిని కూడా కిడ్నాప్ చేసి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరడంతో ఎమ్మెల్సీగా నమోదు చేశారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె. అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి చెందిన జొన్నకూటి అంజనేయులు ఏలూరుకు చెందిన నాని వద్ద రూ.20 వేలు తీసుకున్నాడని ఆ సొమ్ములు ఇవ్వడం లేదని ఆగ్రహించిన నాని అంజనేయులను మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అడ్డగించి బైక్‌తో పాటు అతడిని నిర్మానుష్య ప్రదేశానికి నానితో పాటు మరికొందరు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశాడు. నానితో పాటు మరికొందరిపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

## పెళ్లింట విషాదం

### వంట గ్యాస్ లీకై ఏడుగురికి తీవ్ర గాయాలు

పెనుగొండ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వివాహం జరగాల్సిన ఇంటిలో విషాదం నెలకొంది. బుధవారం సాయంత్రం పెళ్లి జరగాల్సిన ఇంటిలో వంట గ్యాస్ లీకై ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం పెనుగొండలో జరిగింది. స్థానిక కొండపల్లివారి వీధిలో ఉంటున్న ఇవ్వల నాగేశ్వరరావు ఇంటిలో తన కుమారుడు శ్రీనివాసరావు వివహం బుధవారం జరగాల్సి ఉంది. వివాహం నిమిత్తం బంధువులు, కుటుంబ సభ్యులు ఆనందంగా గడుపుతున్న సమయంలో ఉదయం టిఫిన్ నిమిత్తం గారెలు వేస్తుండగా స్టవ్ వద్ద ఉన్న పైపు ఊడిపోవడంతో మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలో ఏడుగురు గాయాలపాలయ్యారు. పెళ్లి కొడుకు ఇవ్వల శ్రీనివాస్, పెద్దమ్మ కవిటంకు చెందిన అయినపర్తి లక్ష్మి, మావయ్య అత్త నరసింహరావు, సత్యవతి, సూర్య హనుమంతరావు, అతడి భార్య నాగమణి, మాచవరపు వీరేంద్ర తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడినవారిని మొదట పెనుగొండ సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి తణుకు ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమచారం. ఇంటిలో ఉన్న వాషింగ్ మిషన్, ఏసీ పూర్తిగా దగ్ధమైంది.


కాలిపోయిన వాషింగ్ మెషీన్

## చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం

- పోలీసుల అదుపులో నిందితుడు
- లాకప్‌లో అతనిపై బాలిక మేనమామ బ్లేడ్‌తో దాడి
- ఆకివీడులో దారుణం.. నిందితుడికి వ్యతిరేకంగా ఆందోళన



బ్లేడ్ దాడిలో గాయపడ్డ మీరావలి.. పోలీసు స్టేషన్ వద్ద బాలిక బంధువులు, పార్టీల నాయకుల ఆందోళన

ఆకివీడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆకివీడు వారపుసంత (సంతమార్కెట్)లో దారుణం చోటుచేసుకుంది. బతుకుదెరువు కోసం తిరుపతి నుంచి ఆరు నెలల క్రితం దంపతులు తమ ఏడేళ్ల కుమార్తెతో స్థానిక సంతమార్కెట్‌లోని పడాలవీధికి వచ్చి అద్దెకు ఉంటున్నారు. తల్లిదండ్రులు కూలిపనులు చేసుకొంటూ పిల్లను చదివించుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ చిన మీరావలి (70) (మాంసం వర్తకుడు) సోమవారం ఆరు బయట ఆటలాడుకుంటున్న బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముందుగా మీరావలిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బాలికకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి శాంపిల్స్ విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. అయితే వైద్యులు, పోలీసులు తమకు న్యాయం చేయరంటూ ప్రభుత్వాసుపత్రి దగ్గర స్టేట్‌మెంట్‌పై తల్లి సంతకం పెట్టలేదు. అనంతరం బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. నిందితుడిని తమకు అప్పగించాలంటూ పోలీసులతో వాదనకు దిగారు. కొందరు సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజుతో ఘర్షణ పడ్డారు. ఈ తరుణంలో లోపలికి బాలిక మేనమామ వెళ్లి లాకప్‌లో ఉన్న నిందితుడు మీరావలిపై దాడి చేసి బ్లేడ్‌తో గాయపర్చాడు. అనంతరం బాలిక మేనమామ పోలీస్ స్టేషన్‌లో సొమ్మసిల్లి పడిపోయాడు. మీరావలిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ జయసూర్య ఆకివీడు ఆసుపత్రిలో మీరావలిని పరిశీలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో బాలిక మేనమామ చికిత్స పొందుతున్నాడు. డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ఎస్ఐ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మేనమామపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

**నిందితుడిని శిక్షించాలి : టీడీపీ శ్రేణులు**

నిందితుడు మీరావలిని కఠినంగా శిక్షించాలని డీఎస్పీ జయసూర్యకు టీడీపీ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. మీరావలికి పార్టీలో ఎటువంటి ప్రాతినిధ్యం లేదన్నారు. పార్టీ అభిమానంతో పొందిన సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు తెలిపారు.

**బాధితురాలికి న్యాయం చేయాలి : ఐద్వా**

మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా మహిళలు ఎస్ఐ హనుమంతు నాగరాజుకు వినతిపత్రం అందచేసి బాధితురాలకి న్యాయం చేయాలని కోరారు.

## మేలో 1,684 కేసులు నమోదు

- రూ.1.03 కోట్ల అపరాధ రుసుం విధింపు



ఏలూరు క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మే నెలలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా రవాణా, వ్యక్తిగత వాహనాలపై 1,684 కేసులు నమోదు చేసి రూ.1.03 కోట్లను అపరాధ రుసుంగా విధించామని ఉపరవాణా కమిషనరు షేక్ కరీమ్ తెలిపారు. ఇందులో పన్ను చెల్లించని, పర్మిట్, ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఓవర్లోడ్, డ్రైవింగ్ లైసెన్సు లేనివి, హెల్మెట్, సీటు బెల్టు, ధరించని తదితర కేసులు నమోదయ్యాయన్నారు. రూ. 62లక్షల11 వేలు వసూలు చేశామన్నారు. పన్ను చెల్లించని 72 వాహనాలను సీజ్ చేశామన్నారు. పన్ను చెల్లించని రవాణా వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని, స్వచ్ఛందంగా పన్ను చెల్లించినట్టయితే పన్నుతో పాటు 50 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందన్నారు.

## ఫేక్ కరెన్సీ ముఠా గుట్టురట్టు / తణుకులో ఐదుగురి అరెస్ట్


తణుకులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తణుకు, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలో ఫేక్ కరెన్సీ ముఠా గుట్టు రట్టయింది. నకిలీ కరెన్సీ నోట్లు చలామణి చేస్తున్న ఐదుగురిని మంగళవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తణుకు ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్‌లో సీడీఎం మెషిన్‌లో జమ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పాలకొల్లు మండలం ఉల్లంపర్రుకు చెందిన అడబాల ఆంజనేయమూర్తి, పోడూరు మండలం జిన్నూరుకు చెందిన జుత్తిగ నాగరాజు, యలమంచిలి మండలం కాజగ్రామానికి చెందిన దిగుమర్తి ఏసు, భీమవరం మండలం యల్లమెల్లిపురం గ్రామానికి చెందిన తోట రామచంద్రరావు, తణుకు ఎన్జీవో కాలనీకు చెందిన పినిశెట్టి చక్రధర్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,67,600 విలువైన రూ.200 నోట్లు 838 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఇదే కేసులో మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. తణుకు ఎన్జీవోకాలనీకి చెందిన పినిశెట్టి చక్రధర్ గత నెల 15న స్థానిక ఎస్బీఐ మెయిన్ బ్రాంచి వద్ద సీడీఎం ద్వారా తన ఖాతాలోకి 200నోట్లు మొత్తం రూ.16,600 నగదును జమ చేశాడు. ఆ నగదు జమ కాకపోవడంతో అదే నెల 21న బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు బ్రాంచి మేనేజర్ విరోతి సోమశేఖర్‌తో కలిసి సిబ్బంది మెషిన్ తెరచి చూడగా జమ చేసేందుకు ప్రయత్నించిన 83 నోట్లు జమ కాకపోగా అక్కడే ఇరుక్కున్నాయి. అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ కరెన్సీ అని తేలడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ కొండయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ కె.ప్రసాదు బృందంగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. కేసులో నిందితులను అరెస్టు చేయడానికి సహకరించిన సీఐ కొండయ్య, ఎస్ఐ ప్రసాదు, ఏఎస్ఐ పోలయ్యకాపు, హెడ్ కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ, కానిస్టేబుల్స్ అప్పారావు, శివాజీ, మోహన మురళీకృష్ణలను అభినందించారు. వీరికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి రివార్డులను అందజేశామన్నారు. ట్రైనీ డీఎస్పీ కె.మానస తదితరులు పాల్గొన్నారు.

## సమయ పాలన పాటించండి : సీడీపీవో

పెదవేగి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు సమయపాలన పాటించాలని పెదపాడు అదనపు సీడీపీవో ఎం.సునీల్ రాజశేఖర్ తెలిపారు. పెదవేగిలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన సెక్టారు సమావేశంలో సునీల్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల నమోదు సంఖ్య పెరిగేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రాల పరిశుభ్రత పాటించాలని, క్రమం తప్పకుండా కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు.

## వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో నేటి నుంచి మార్పులు

జంగారెడ్డిగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి):విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై వెళ్తున్న ట్రాన్స్‌కో టవర్ లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి 10వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాల్లో మార్పులు చేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ మంగళవారం తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఏ-గ్రూపులో తెల్లవారు జామున 2 నుంచి 11 గంటల వరకు, బి-గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం 6గంటల వరకు, రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని, రైతులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

## అప్పనవీడులో ఘనంగా అన్నదానం

పెదపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద గంగుల ప్రతాప్ కుమార్, కవితల ఆర్థిక సహకారంతో సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించినట్టు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

## పోలవరం పరిహారం చెల్లించాలి

వేలేరుపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులందరికీ పరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.గౌస్ డిమాండ్ చేశారు. మంగళవారం పడమర మెట్టగూడెంలో నిర్వహించారు. హాజరైన ప్రజలనుద్దేశించి గౌస్ మాట్లాడారు. పోలవరం ముంపులోని 41.15 కాంటూరు లేవల్ గ్రామాల్లో సర్వేలు పూర్తి చేశారని, అలాగే 45.72 కాంటూరులో ఉన్న కొర్రా జులగూడెం, త్యాగరపల్లి, సుద్దగుంప, శివకాశీపురం, నాగులగూడెం, నడిమిగొమ్ము కాలనీ, తాటుకూరు గొమ్ముకాలనీ, వసంతవాడ, మద్దిగట్ల, గుంపెనగూడెం, తాతాపూతిరాల, తదితర గ్రామాలను 41కాంటూరులో తీసుకుని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

ఏలూరుటూటౌన్/ టి.నరసాపురం/ పెదపాడు/ లింగపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతులు ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ జీ.శేషారత్నం పాల్గొని విద్యార్థులకు సెల్ ఫోన్లు అతిగా వినియోగిస్తే కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ పీ.శంకర్, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్ కుమార్, కనకదుర్గ, అస్లాంపాష పాల్గొన్నారు. టి.నర్సాపురం శాఖాగ్రంథాలయంలో గ్రంథ పాలకుడు ఆర్.కిశోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పెదపాడు గ్రంథాలయంలో రిసోర్స్‌పర్సన్ శెటికం వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి జాన్‌బాబు పాల్గొని విశ్వం - దానిలో దాగి ఉన్న అంశాలు, రోదసి యాత్ర - విశేషాలపై అవగాహన కల్పించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకటరమణ విద్యార్థులకు నీతికథలు బోధించారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఆర్టీవో మదన్ అలీ

టి.నర్సాపురం, జూన్3(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం ఆర్టీవో మదన్ అలీ అన్నారు. టి.నర్సాపురంలో రహదారి భద్రతపై వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం చట్టరిత్యానేరమన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని హితవుపలికారు. ఆటోడ్రైవర్లు ఇరువైపులా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయరాదని, మద్యం మత్తులో వాహనాలు నడపటం నేరమని తెలియజెప్పారు. కార్యక్రమంలో సీనియర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.రంగనాయకులు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.సురేశ్‌బాబు పాల్గొన్నారు.

## రజకులు ఐక్యంగా ఉండాలి

ఏలూరు రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారులు ఐక్యంగాఉంటూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య పిలుపునిచ్చారు. ఏలూరు సంఘ భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక గ్రామాల్లో రజక వృత్తిదారులు ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధ్యక్షులుగా బొద్దూరు చిన్న లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా కట్టంగ సత్యనారాయణ, కార్యదర్శిగా పి.నాగదుర్గా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఓబలంక ఏడుకొండలు ఎన్నుకున్నారు.

## ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

పెదవేగి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం పంచాయతీ వీరపాలెం గ్రామానికి చెందిన పరసా రాటాలు నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.





## యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

పెదవేగి/పెదపాడు/ఉంగుటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం సాకారమవుతుందని పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. యోగాంధ్రను పురస్కరించుకుని పెదవేగి సర్కిల్‌లో పోలీసులు మంగళవారం యోగాసనాలు వేశారు. ఎస్ఐ కె.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని టీటీడీసీలో ఏలూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి ఆధ్వర్యంలో ఆంధ్రా ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్రీదేవి, బ్యాంకు ఉద్యోగులు మొత్తం 90 మంది యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు వేశారు. ఉంగుటూరు పంచాయతీ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్రను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సర్పంచ్ బండారు సింధు మధు, తహసీల్దార్ పాలపర్తి రవి కుమార్, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, ఆయుర్వేద వైద్యాధికారి శివ ప్రసాద్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, ట్రైనర్ పి.వి.పెద్దిరాజు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దే రేషన్

టి.నర్సాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దే రేషన్ ఇవ్వనున్నట్టు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి.వి.రమణ తెలిపారు. మండల కేంద్రంలోని రేషన్ షాపు వన్‌ను తనిఖీచేసి రేషన్ పంపిణీ చేస్తున్న విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మెట్టగూడెంలోని వృద్ధురాలు అణగాని చిట్టెమ్మ, కానగాని కనకదుర్గల ఇంటికి వెళ్లి స్వయంగా రేషన్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయిబాబా, సీనియర్ అసిస్టెంట్ హరిబాబు, వీఆర్వో ఫణి కుమార్, డీలర్ నందికొండ అఖిల పాల్గొన్నారు.

## వేధింపులపై మహిళా సిబ్బందికి అవగాహన

ఉంగుటూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మహిళా సిబ్బందికి వేధింపుల నిరోధంపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజ్ మనోజ్ అధ్యక్షతన అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. మహిళా సిబ్బందికి ఉన్న ఇబ్బందుల గురించి చర్చించారు.

# స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ నగరంగా ఏలూరును తీర్చిదిద్దేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో నూతనంగా కొనుగోలు చేసిన 9 ట్రాక్టర్లను మేయర్ నూర్జహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని శానిటేషన్ పనులకు ఆటంకం కలగకూడదని నూతన ట్రాక్టర్లు కొనుగోలు చేశామన్నారు. పాతట్రాక్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఆరు ట్రాక్టర్లు శానిటేషన్ పనులకు 3ట్రాక్టర్లు తాగునీటి సరఫరాకు వినియోగిస్తామన్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని శానిటేషన్ సిబ్బంది అలసత్వం వహించకుండా ఎప్పటిచెత్త అప్పుడే ఎత్తాలని హెచ్చరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3కోట్లతో ట్రాక్టర్‌తో సహా కంపెక్టర్స్ పుష్‌కాట్‌లు కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కోఆప్షన్‌సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, అడిషనల్ కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు.





## కిశోర బాలికలకు అవగాహన ర్యాలీ

ద్వారకాతిరుమల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ టి.మేరీ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కిశోర బాలికలు, మహిళలతో ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు అంశాలను, మహిళా చట్టాలను వారికి సమావేశంలో వివరించారు. మహిళా పోలీస్ లక్ష్మీ సుజన మాట్లాడుతూ బాలికలకు స్థిరమైన సరైన నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ, వృత్తి, వ్యాపార, ఉద్యోగ వివాహ విషయాల్లో ఎంపిక చేసుకునే అవకాశం వినియోగించుకోవాలన్నారు.

## నీటి తీరువా వసూలు చేయాలి

పెదపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నిర్దేశిత లక్ష్యాల మేరకు నీటితీరువా వసూలు చేయాలని తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. తహసీలార్ కార్యాలయంలో నీటితీరువా వసూళ్ల లక్ష్యాలు, సీసీఆర్సీ కార్డులను సాగుదారులకు అందజేతపై గ్రామ వీఆర్వోలతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు కృష్ణజ్యోతి మాట్లాడుతూ కొత్తగా వస్తున్న రైస్‌కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. అనం తరం నీటి తీరువా వసూళ్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీ ఆర్వోలు ఘంటా ప్రభాకరరావు, అల్లు ప్రసాద్, షైనర్‌బాబులను అభినందించారు.

## టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా తాటి అప్పారావు

చింతలపూడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ చింతలపూడి పట్టణాధ్యక్షుడిగా తాటి అప్పారావును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం అప్పారావుకు కందువాకప్పి జె.ముత్తారెడ్డి, ఆట్లూరి శ్రీనివాసరావు, చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావులు అభినందనలు తెలిపారు. గత ఏడాది టీడీపీ పట్టణాధ్యక్షుడిగా పనిచేసిన పక్కాల వెంకటేశ్వరరావు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ పదవిని అప్పారావుకు కేటాయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీ కోసం పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● బుధవారం 4 జూన్ 2025

### ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు అనేక ఉచిత పథకాలు వర్తిస్తాయని ప్రిన్సిపాల్ ఎన్. శాంతిజ్యోతి అన్నారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇంటర్‌లో చేరే విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు. విద్యార్థులుకు ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఉచితంగా మధ్యాహ్న భోజన పథకం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### వంట ఏజెన్సీలకు శిక్షణ

ఆగిరిపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని జడ్పీ హైస్కూలులో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తయారీపై వంట ఏజెన్సీలకు మంగళవారం ఒక రోజు శిక్షణ మండల స్థాయిలో ఎంఈవో కలపాల సర్వేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం రుచిగా వండి విద్యార్థులకు వడ్డించడం, నిబంధనల ప్రకారం మెనూ ఉండాలని ఏజెన్సీ సభ్యులకు వివరించారు. ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్‌కుమార్, హెచ్ఎం పులి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# పిల్లర్లకు బీటలు.. ఆందోళనలో ప్రజలు



- కూలేందుకు సిద్ధంగా అన్నవరం మీడియం డ్రెయిన్‌పై వంతెన
- ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారులు
- స్పందించకుంటే ముప్పు తప్పదంటున్న వాహనదారులు

ముదినేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో అన్నవరం మీడియం డ్రెయిన్‌పై ఉన్న వంతెన ప్రమాద స్థితిలో ఉంది. ఈ వంతెనకు పునాదులుగా ఉన్న పురాతన కారు రాయి దిమ్మలకు బీటలు వారడం, స్లాబు అడుగు భాగంలోని ఇనుముకు తుప్పు పట్టడంతో వంతెన ఉనికికే ప్రమాదం ఏర్పడింది. వంతెన పిల్లర్లు ఏళ్ల తరబడి బీటలు వారుతున్నప్పటికీ డ్రెయినేజీ శాఖ గానీ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు గానీ పట్టించుకోకపోవటంతో రెండు పిల్లర్లు మరింత ప్రమాద స్థితికి చేరాయి. గతంలో ఓఎన్‌జీసీ భారీ వాహనాలు వెళ్లేందుకు అప్పట్లో బలహీనంగా ఉన్న వంతెన అడుగు భాగంలో ఇనుప గడ్డర్లు ఏర్పాటు చేసి ఆ సంస్థ అధికారులు స్లాబుపై మరో స్లాబు వేశారు. అదనపు బరువును పురాతన పిల్లర్లే భరించాల్సి రావటంతో, రెండు పిల్లర్లు బీటలు వారి ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం వంతెన బరువును భరించే సామర్థ్యం పాత పిల్లర్లకు లేదు. బీటలు వారిన పిల్లర్లు ఎపుడైనా కూలవచ్చు. సుమారు 60 ఏళ్ల క్రితం పీడబ్ల్యూడీ నిధులతో ఈ వంతెన నిర్మాణాన్ని డ్రెయినేజీ శాఖ పర్యవేక్షించగా, ఆర్ అండ్‌బీ శాఖ ఈ వంతెన నిర్వహణను గాలికొదిలేసింది. ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న ఈ వంతెన మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గొర్రె పిల్లను కాపాడబోయి..



మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) మృతుడు మారేశ్వరరావు(ఫైల్)

చాట్రాయి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నీటి కుంటలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న గొర్రె పిల్లను కాపాడబోయిన గొర్రెల కాపరి అతనే ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన విషాద ఘటన మంగళవారం సాయంత్రం చాట్రాయిలో జరిగింది. మృత్యువు అంచులకు వెళ్ళిన గొర్రెపిల్ల బ్రతకటం, కాపరి మృతి చెందటం విధి లిఖితమనే చెప్పాలి. చాట్రాయి కోతమిల్లు బజారులో నివాసం ఉంటున్న సర్నాల నాగేశ్వరరావు, అంజమ్మల కుమారుడైన మారేశ్వర రావు(40) గొర్రెలు కాస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం మారేశ్వరరావు ఓ రైతు పామాయిల్ తోట దగ్గర గొర్రెలు మేపుకుంటుండగా, ఆ తోటలో ఉన్న వ్యవసాయ నీటి కుంటలో గొర్రె పిల్ల జారిపడిపోయింది. ఆ నీటి కుంట లోతు తెలియని మారేశ్వరరావు కుంటలోకి దిగి గొర్రెపిల్లను పట్టుకొని ఒడ్డుకు నెట్టి, తాను పైకి ఎక్కే ప్రయత్నం చేయగా, చెరువులో నీరు ఇంకకుండా పరిచిన ప్లాస్టిక్ పట్టా జారిపోయి కాలు జారి నీటిలో మునిగి చనిపోయాడు. ఎస్ఐ డి రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.




చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో బదిలీ అయిన పోలీసులకు సన్మానం

## బదిలీపై వెళ్తున్న పోలీసులకు ఘనంగా వీడ్కోలు

చాట్రాయి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో సుదీర్ఘ కాలం పనిచేసి బదిలీ అయిన పోలీసులను సోమవారం రాత్రి ఎస్సై డి రామకృష్ణ, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఏఎస్సై గజపతి రావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు విష్ణుకుమార్, గిరిబాబు, వెంకటేశ్వరరావు, అశోక్, దుర్గ ఇక్కడ నుంచి జిల్లాలో వివిధ పోలీస్టేషన్లకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన పోలీసులు మండలంలో అందించిన సేవలను ఎస్సై రామకృష్ణ కొనియాడారు. వీరు అక్కడ కూడా గొప్పగా ప్రజలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

## 'నేడు వెన్నుపోటు-గొడ్డలివేటు' కరపత్రాల పంపిణీ

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు, గొడ్డలివేటు పేటెంట్ జగన్‌రెడ్డి కార్యక్రమంపై కరపత్రాలను టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. మంగళవారం కైకలూరులో ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. జగన్ వెన్నుపోటు, గొడ్డలివేటు రాజకీయంపై కరపత్రాలను బుధవారం కైకలూరులో ఇంటింటికి అందజేస్తామని, టీడీపీ నేతలు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, మైనార్టీ నాయకుడు ఎండీ జాని, పార్టీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మాజీ సర్పంచ్ పళ్లెం సత్యనారాయణ, అడ్డెపల్లి బ్రహ్మాజీ, రామస్వామి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు వైసీపీ వెన్నుపోటు : వీరమల్లు

ముదినేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు అన్ని వర్గాల ప్రజలకు వెన్నుపోటు పొడిచి కిరాతక పాలన సాగించిందని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైసీపీ ప్రభుత్వం 85 శాతం హామీలకు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. మంగళవారం ఆయన వడాలిలో విలేకరులతో మాట్లాడుతూ వెన్నుపోటుకు, గొడ్డలి వేటుకు పేటెంట్ జగన్మోహన్‌రెడ్డి అని పేర్కొంటూ ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే జగన్ వెన్నుపోటు పొడిచాడని అన్నారు. తన బాబాయ్ వివేకానంద రెడ్డిని చంపిన కిరాతకుల్ని కాపాడి సంబంధ బాంధవ్యాలకే వెన్ను పోటు పొడిచాడని విమర్శించారు. వైసీపీ వెన్నుపోటు పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోపే 70 శాతం హామీలను అమలు చేసిందని తెలిపారు.

## బెదిరించి బైక్ దొంగలించిన ఇద్దరికి రిమాండ్

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పాతకక్షలను పురస్కరించుకొని ఒక వ్యక్తిని కత్తితో బెదిరించి బుల్లెట్ బైక్‌ను దొంగలించిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. గత నెల 31న కైకలూరు మండలం ఆటపాక శివారు జానపేటలో మర్రి రాము వ్యక్తిగత పనులపై వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన కుమ్మరికుంట మదన్‌కుమార్, రాయినూతల విజయ్ పాతగొడవలను పురస్కరించుకొని రామును అడ్డగించి కత్తితో బెదిరించి దాడి చేశారు. అతని బైక్‌ను అపహరించారు. రాము కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కాపాడారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై డి వెంకట కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని బైక్‌ను, చాకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి

ముసునూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం ఎస్సీ కాలనీలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం కంసాల చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్న క్రమంలో పొన్నూరు సోంబాబు ట్రాక్టర్ మట్టి లోడ్‌తో వస్తోంది. చేసుకుని వస్తుంది. ట్రాక్టర్ రివర్స్ చేస్తున్న క్రమంలో రోడ్డుపై నడుచుకుంటు వస్తున్న గడ్డం అంజమ్మ (65)ను ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో ఆమె అక్కడకక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
| --- | --- |
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

**నెక్ కోడి గుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

# కొల్లేరు సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

**కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ**
**రాజ్యసభ సభ్యుడు పాకా సత్య నారాయణ**



పాకా సత్యనారాయణ, శ్రీనివాస వర్మను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కామినేని తదితరులు

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్య పరిష్కారానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్య నారాయణ అన్నారు. మంగళవారం కైకలూరులో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ్యసభకు ఎన్నికైన పాకా సత్యనారాయణను మంత్రి శ్రీనివాసవర్మతో కలిసి సన్మానించారు. మంత్రి వర్మ మాట్లాడు తూ కష్టపడి పనిచేసేవారికి బీజేపీలో ఎప్పుడూ పదవులు వరిస్తాయని అందుకు ఉదాహరణే తనతో పాటు రాజ్యసభకు ఎన్నికైన సత్య నారాయణ అన్నారు. కొల్లేరు సమస్య త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. పాకా సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్విరాన్మెంట్ కమిటీ నిబంధనల మేరకు కొల్లేరు సమస్యను పరిష్కరిం చేందుకు కట్టుబడి ఉన్నామని పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలు జీవనోపాధికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మరో పది రోజుల్లో ఎన్విరా న్మెంట్ కమిటీ కొల్లేరులో పర్యటిస్తుందని అందరం కలిసికట్టుగా క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి కొల్లేరు ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేద్దామన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు లభిస్తుందన్నారు. కైకలూరులో బీసీ భవనాన్ని రూ.2 కోట్లతో నిర్మిస్తామని అందుకు ఎంపీలైన శ్రీనివాసవర్మ, పాకా సత్యనారాయణ, పుట్టా మహేష్, బీదా మస్తాన రావు ఆ నిధులను కలిసికట్టుగా సమకూ రుస్తారన్నారు. కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దత్తాశ్రమంలో పాకాను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, గౌడ సంఘం నాయకుడు పోసిన పాపారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పంపిణీ చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు కైకలూరు 33/11కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్డు ఫీడర్‌లో అంతరాయం కలుగుతుందని, ఆ ప్రాంతంలోని చెట్లు కొట్టడం, లైన్ల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. బైపాస్‌రోడ్డు పరిధిలోని దానగూడెం రోడ్డు, పెద్దమసీదు సెంటర్, మెయిన్‌రోడ్డు, తాలుకా సెంటర్, కోర్టు, బస్టాండ్, డిగ్రీ కాలేజీ ప్రాంతాల్లో గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సహకరించాలని కోరారు.

**ముదినేపల్లి:** మండలంలోని పెదపాలపర్రు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల నరికివేత పనుల కోసం బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్టు గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. పెదపాలపర్రు ఫీడర్ పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**చాట్రాయి:** మండలంలోని జనార్ధనవరం, ఆరుగొలనుపేట గ్రామాల్లో 4వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం గృహాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. గృహ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



ఆటపాకలో రేషన్ ఇస్తున్న తహసీల్దార్



కొండూరులో వృద్ధులకు తహసీల్దార్



ఊటుకూరులో రేషన్ పంపిణీ దృశ్యం

# వృద్ధుల ఇళ్లకే వెళ్లి రేషన్ పంపిణీ

కైకలూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకే వెళ్లి రేషన్ సరఫరాను చేయాలని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. మంగళవారం కైకలూరు మండలం ఆటపాకలో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ళకు వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు ప్రతి నెలా రేషన్ డీలరే స్వయంగా ఇళ్ళకు తీసుకువచ్చి అందిస్తారన్నారు. అలాగే ప్రతి గ్రామంలోని డీలర్లు ఈ విధానాన్ని కచ్చితంగా పాటించాలని, ఎక్కడైనా అవకతవకలకు పాల్పడినా, పంపిణీ సక్రమంగా చేయకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వోలు పాయేసు, ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

**కలిదిండి:** దివ్యాంగులు, వయో వృద్ధులకు వారి ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. మంగళవారం కొండూరులో వీఆర్వోతో కలసి వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేశారు. మొత్తం 46 రేషన్ దుకాణాల పరిధిలో ఉన్న దివ్యాంగులు, 65 ఏళ్ల వృద్ధులకు వారి ఇంటి వద్దనే రేషన్ సరుకులను అందిస్తున్నామన్నారు.

**ముదినేపల్లి:** చౌక ధరల దుకాణాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ముదినేపల్లి మండలంలో వారి ఇళ్ల వద్దే బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నారు. మంగళవారం మండలంలోని వాడవల్లి, ఊటుకూరు, ఉప్పరగూడెం, పెదగొన్నూరు గ్రామాల్లో కూటమి నాయకులు, చౌక డిపోల డీలర్లు రేషన్ అందజేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సూదాబత్తుల వరలక్ష్మి, ఊటుకూరులో ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయగా, వాడవల్లి, ఉప్పరగూడెం గ్రామాల్లో ఎన్‌డిఏ నాయకులు వృద్ధులకు రేషన్ పంపిణీ చేశారు. బియ్యం లోడు సోమవారం సాయంత్రం రావటంతో నాలుగు గ్రామాల్లో మంగళవారం రేషన్ పంపిణీ ప్రారంభమయింది.



ఎంపికైన క్రీడాకారులతో సెలక్షన్ కమిటీ

## బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నూజివీడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అండర్-23, 3/3 కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ విక్టోరియా టౌన్ హాల్ గ్రౌండ్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల జట్టుకు విక్టోరియా టౌన్ హాల్‌కు చెందిన బి. ప్రభు దీపిక, షేక్ హస్రా, బి. ప్రణవి, బి. కుసుమ, బాలుర జట్టుకు విక్టోరియా టౌన్‌హాల్‌కు చెందిన ఎ. తేజ, బి. సంజయ్, నూజివీడు డీఎన్నార్ కళాశాలకు చెందిన షేక్ యాసిన్‌తో పాటు విజయవాడకు చెందిన జి నగేష్‌బాబులు ఎంపిక అయ్యారు. వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జీకే పుస్తకాలు చదవాలి

కలిదిండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవటం అలవర్చుకోవాలని కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్ బాబు, రాఘవులు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలపై అవగాహన కల్పించి పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

## టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

కలిదిండి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు నున్న సుబ్రహ్మణ్యం, నాయకులు భట్రాజు ఏసుబాబు, బోయిన గోవింద్, బోడావుల రాము, జాన్‌రాజ్, యలవర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్రనాథ్

## కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

నూజివీడు టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి పథకాలను వినియోగించుకుంటూ స్వయం ఉపాధిని పొందాలని నూజివీడు ఎంపీడీవో చెన్న రవీంద్రనాథ్ అన్నారు. నూజివీడు తుక్కులూరు గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ కుట్టులో శిక్షణ పొందిన వారు కుట్టుమిషన్ వినియోగిస్తూ స్వయం ఉపాధిని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయ పథకాలను వినియోగించుకొని ముందుకు సాగాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సీహెచ్. చంద్రిక తుక్కులూరు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య జీవనం యోగాతోనే సాధ్యం



ఆగిరిపల్లిలో యోగాసనాలు వేయిస్తున్న ఎస్ఐ శుభశేఖర్ దృశ్యం

ఆగిరిపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగాంధ్ర పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందులో భాగంగా మంగళవారం ఆగిరిపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐ శుభశేఖర్ యోగా నిర్వహించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు.

**నూజివీడు టౌన్:** నూజివీడు మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగ చేస్తూ ఆరోగ్య ప్రయోజనాలను కాపాడుకోవాలని నూజివీడు ఎంపీడీవో చెన్ను రాఘవేంద్రనాథ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో యోగా



ముసునూరులో రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

## రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలి

**సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్**

ముసునూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా జరగాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. మంగళవారం ముసునూరులోని రెండు రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో సౌకర్యాలను, రేషన్ పంపిణీని పరిశీలించి మాట్లాడుతూ దుకాణాల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను బోర్డుపై ఉంచాలన్నారు. దివ్యాంగులకు, 65 ఏళ్ళుపై పడిన వృద్ధుల ఇళ్లకే వెళ్లి రేషన్ సరుకులు అందజేయాలన్నారు. సమయ పాలన పాటించి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీపై ఫిర్యాదులు వచ్చినా, అవకతవకలను పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కేవీ రమణ, పౌర సంబంధాల డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు, వీఆర్వో మహేంద్రరావు పాల్గొన్నారు.

# ఆకివీడులో దారుణం

- చిన్నారిపై వృద్ధుడి అత్యాచారం
- పోలీసుల అదుపులో నిందితుడు
- లాకప్‌లో ఉన్న నిందితుడిపై బాలిక మేనమామ బ్లేడ్‌తో దాడి
- ఆసుపత్రికి తరలించిన పోలీసులు



బ్లేడ్ దాడిలో గాయపడ్డ మీరావలి.. పోలీసు స్టేషన్ వద్ద బాలిక బంధువులు, పార్టీల నాయకుల ఆందోళన

ఆకివీడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆకివీడు వారపుసంత (సంతమార్కెట్)లో దారుణం చోటుచేసుకుంది. బతుకుదెరువు కోసం తిరుపతి నుంచి ఆరు నెలల క్రితం దంపతులు తమ ఏడేళ్ల కుమార్తెతో స్థానిక సంతమార్కెట్‌లోని పడాలవీధికి వచ్చి అద్దెకు ఉంటున్నారు. తల్లిదండ్రులు కూలిపనులు చేసుకొంటూ పిల్లను చదివించుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన షేక్ చిన మీరావలి (70) (మాంసం వర్తకుడు) సోమవారం ఆరు బయట ఆటలాడుకుంటున్న బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముందుగా మీరావలిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బాలికకు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి శాంపిల్స్ విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. అయితే వైద్యులు, పోలీసులు తమకు న్యాయం చేయరంటూ ప్రభుత్వాసుపత్రి దగ్గర స్టేట్‌మెంట్‌పై తల్లి సంతకం పెట్టలేదు. అనంతరం బాలిక తల్లిదండ్రులు, బంధువులు, పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. నిందితుడిని తమకు అప్పగించాలంటూ పోలీసులతో వాదనకు దిగారు. కొందరు సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐ నాగరాజుతో ఘర్షణ పడ్డారు. ఈ తరుణంలో లోపలికి బాలిక మేనమామ వెళ్లి లాకప్‌లో ఉన్న నిందితుడు మీరావలిపై దాడి చేసి బ్లేడ్‌తో గాయపర్చాడు. అనంతరం బాలిక మేనమామ పోలీస్ స్టేషన్‌లో సొమ్మసిల్లి పడిపోయాడు. మీరావలిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ జయసూర్య ఆకివీడు ఆసుపత్రిలో మీరావలిని పరిశీలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో బాలిక మేనమామ చికిత్స పొందుతున్నాడు. డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో ఎస్ఐ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక మేనమామపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

**నిందితుడిని శిక్షించాలి : టీడీపీ శ్రేణులు**

నిందితుడు మీరావలిని కఠినంగా శిక్షించాలని డీఎస్పీ జయసూర్యకు టీడీపీ శ్రేణులు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. మీరావలికి పార్టీలో ఎటువంటి ప్రాతినిధ్యం లేదన్నారు. పార్టీ అభిమానంతో పొందిన సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు తెలిపారు.

**నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఐద్వా**

మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా మహిళలు ఎస్ఐ హనుమంతు నాగరాజుకు వినతిపత్రం అందచేసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.